"ఏయ్, బుద్ధుందా నీకు. లోపలికిరావచ్చా నువ్వు ? అవన్నీ యిక్కడపెట్టు. ఈ రెండుపళ్ళూ పట్టుకెళ్ళు"

"నీ బోడిజాలి నాకక్కర్లేదు"

"ఏవిటే చూస్తున్నావ్, అవిక్కడపెట్టు. లేకపోతే తంతాను" పూజారి కళ్ళెర్రజేశాడు

"నువ్వన్నేయంగా అమ్ముకుంటున్నావ్. మేమాకల్లో సత్తన్నాం. నువ్వుతంతే నేను తిరగబడి తంతాను"

"పాపం మూటకట్టుకుంటున్నావే వెధవముండా. అందుకే అడుక్కుతింటున్నావ్"

"నోర్ముయ్‌రా లంజాకొడ్కా. పాపం గురించి నాకు సెప్పకురా. అట్టాగయితే నువ్వూ అడుక్కుతినాలి. అసలా ముండాకొడుకుంటే నిన్ను బతకనిత్తాడా" ఎల్లమ్మ సింహంలా గర్జించింది.

పూజారి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

ఎల్లమ్మ కుర్రోడిదగ్గర కొచ్చింది. వాడ్ని ఎత్తుకుంది. ఆమెలో భయంలేదు, బాధలేదు, దిగులులేదు. ఎల్లమ్మ నరనరంలోనూ నూతనోత్సాహం ఆవరించింది. గుండెనిండా ధైర్యం నిండిపోయింది. శరీరం గాలిలో తేలిపోయింది.

ఇప్పుడు ఎల్లమ్మ వజ్రంలావుంది. కత్తిలావుంది, అసలైన మనిషిలావుంది.

## ఆస్థానకవి

తేజోనిధి

అనగనగా క్రీస్తుశకంలోనే ఆనందనిలయ సామ్రాజ్యాన్ని సింహబల మహాచక్రవర్తి పరిపాలన చేస్తుండేవాడు. తన ఆనందనిలయ సామ్రాజ్యంలో అంతా ఆనందంగా గడుపుతున్నారని సింహబల మహాచక్రవర్తి సంతోషం వెలిబుచ్చేవాడు.

తన రాజ్యానికేం—

రథ- గజ- తురగ- పదాతిదళాలు సర్వసన్నద్ధంగా ఉండేవి. తనరాజ్యంలో ఎక్కడ విచారం తలెత్తినా సైన్యం సమాయత్తమైపోయి— విచారాన్ని సంతోషంగా మార్చి— ఇంచక్కా రాజధాని చేరుకొనేది.

352

రాజభవనం కళకళలాడుతుండేది. దేవకన్యల్లాంటి కళాకారిణిలు నిరంతరం భరతముని నాట్యాన్ని అభినయిస్తుండేవారు. గాయక శిఖామణులు భక్తిగీతా లాలపించేవారు. చిత్రకారులు పరమాత్మని చిద్విలాసాన్ని మాత్రమే చిత్రిస్తుండేవారు.

అదిలేదు– ఇదిలేదు అనకుండా అన్నీ ఉన్నాయన్న సంతృప్తి సింహబల మహాచక్రవర్తిగారికున్నా– హృదయంలో మాత్రం ఏదో అవ్యక్తమైనలోటు అప్పుడప్పుడు తొంగిచూసేది! అదేమిటో ఆయనకే అంతుపట్టలేదు–

కాలం గడిచిపోతుంది!

హఠాత్తుగా తన సామ్రాజ్యంలో ఎందుకో అలజడిరేగినట్టు సింహబల మహాచక్రవర్తిగారు పసిగట్టేరు.

ప్రజలు ఆకలంటున్నారు. ఉన్నవారిక్రింద మేమీ ఊడిగం చేయలేం- బ్రతుక్కో ఆసరా కల్పించండని బజార్ల వెంటపడుతున్నారు. పెరుగుతున్న ధరల్లో మా జీవితావసరాలందటంలేదని ఒకటే గోలపెడుతున్నారు.

సింహబల మహాచక్రవర్తి కిదేమీ అర్థంకాలేదు! ఈ అలజడికి మూలకారణం 'ఆకలి' కాదనీ, అధికధరలూ కావనీ సామ్రాజ్యంలో ఏదో లోటు జరిగిన తాలూకు అరిష్టమనీ పసిగట్టేరు! వెంటనే ఆ కలని అరిచే ప్రజలమీదికి తన చతురంగ బలాన్నీ పంపి అలజడిని అణిచివేసేడు!

ఆస్థాన జ్యోతిష్యులవారిని రావించి అరిష్టానికి మూలమేమిటో కనుక్కోమన్నాడు.

ఆయన అహోరాత్రులూ ఆలోచించి అసలు విషయాన్ని కనిపెట్టేసి ఆనందంగా పరుగెత్తుకొచ్చేడు.

'ఏం మహాశయా! విషయం తేలిందా?'

'తేలింది మహాప్రభూ!'

'అపచారం ఏం జరిగింది?'

'పెద్ద అపచారమే జరిగింది ప్రభూ!'

'పెద్దదా? ఏమిటది? వెంటనే వివరించు' సింహబల మహాచక్రవర్తి మాటల్లో తొట్రుపాటు తొంగిచూసింది.

'ప్రభూ! తమ పితృదేవుని పాలనాకాలంలో మనకో ఆస్థానకవి ఉండేవాడు. ఆస్థానకవి చనిపోయాకే తమ పితృదేవులు అకాలమరణం చెందేరు. సింహాసనాన్ని

వెంటనే మీరధిష్ఠించారుగానీ ఆస్థానకవి ఆసనం మాత్రం అలాగే ఉండిపోయింది. వెంటనే ఒక సదాచార సంపన్నుడైన, కవిత్వం తెలిసిన- బ్రాహ్మణోత్తముని ఆస్థాన క వి గా నియమించకుంటే ఈ అరిష్టం మన సింహాసనం కీడుకి కారణమవుతుంది!' అన్నాడు.

సింహబల మహాచక్రివర్తి ఒక్కసారి నొలుక కరచుకున్నాడు.

'ఔరా! నిజంగా ఎంత అపచారం జరిగింది. ఈ అరిష్టమే ఈ ప్రజల్లోని అసంతృప్తికి కారణం, ఈ అరిష్టమే ఇక్కడి ప్రజల ఆకలికి కారణం'— ఆపాద మస్తకమూ కంపించిపోయేడు. తన రాజ్యాధికారంలో మొదటిచర్యగా దీన్ని వెంటనే అమలువరచాలని సంకల్పించుకున్నాడు.

జ్యోతిష్యులవారి సమస్యా పరిష్కారంలోని సమయోచిత పరిజ్ఞానానికి మెచ్చుకొని పారితోషికం యిచ్చి ఘనంగా ప్రశంసించేరు. ఆ మరుదినమే తన రాజ్యంలో దండోరా వేయించేరు.

'ఆస్థానకవి నియామకం జరుగుతుంది గాబట్టి అర్హతలున్నవారు రావచ్చని'

చాలామంది వచ్చేరు! కానీ సింహబల మహాచక్రవర్తి కెవరూ నచ్చలేదు. కారణం వచ్చినవారెవరూ సదాచార సంపన్నులు కాకపోగా- అసలువాటిమీద నమ్మకం లేనివారు.

ఆయన అసంతృప్తిగా ముఖం చిట్లించుకున్నాడు!

కానీ—

ఆ దేశప్రజల అదృష్టమో అన్నట్లు—

తెలరేగిన అలజడుల కంతిమయాత్ర నన్నట్లు—

ముందు ముందు దేశం నిత్యకళ్యాణం- పచ్చతోరణంగా మారుతుందన్నట్లు—

చీకటికి వెలుగులా-

నడిసముద్రం నావలా-

ఒక మహానుభావుడు వేయినొక్క ఒంటెద్దు బండ్లమీద ఏమిటో వేసుకొని సింహబల మహాచక్రివర్తి ముందు సాక్షాత్కరించేడు!

'ఎవరు స్వామీ మీరు?' సవినయంగా ప్రశ్నించేడు సింహబల చక్రివర్తి.

ఆయన చిరునవ్వు నవ్వేడు!

సనాతన సదాచార సంపన్నతంతా మూర్తీభవించి- ప్రజల పెన్నిధిలా— తన

సింహాసనం సన్నిధికి వేంచేసిన ఆయన్ను చూడగానే సింహబల మహాచక్రవర్తికి సగం భారం తీరినట్లయింది।

పోతే వివరాలు కనుక్కోవాలి।

'ఎవరు స్వామీ మీరు?' మరలా ప్రశ్నించేడు.

'నేను తెలియదా సింహబళా। లోకనాథుడ్ని' అన్నాడు.

'ఆ వెనుక ఒంటెద్దు బండ్లమీద ఒకేవిధంగా కనిపిస్తున్నవేమిటి స్వామీ।'

'అవి వేయిన్నొక్క బండ్లు, నేను వ్రాసిన కావ్యాలు. ఆదిశేషునికి వేయిపడగలే–కానీ నాకవిత్వం వేయిన్నొక్కటి– అంటే ఆదిశేషునకైనను అలవిగాను' సగర్వంగా అన్నాడు। దానితో సింహబలునికి మిగతా సగంభారం కూడా దిగిపోయింది। ఇన్నాళ్లకి తమ ఆస్థానానికి తగినకవి దొరికాడనుకుంటూ మురిసిపోయేడు.

దీనితో ప్రజల్లో రేగిన అలజడికాస్తా తగ్గిపోతుంది. అరిష్టాలుతొలగి అన్నీ శుభాలే చేకూరుతాయనుకున్నాడు.

వెంటనే ఆస్థానకవి నియామకం ఘనంగా జరిపి కవితాసామ్రాజ్యానికి లోకనాథుడికి పట్టంగట్టేడు.

కవిసామ్రాట్టు లోకనాథులవారు పనికుపక్రమించేరు।

* * *

కానీ ప్రజల్లో అలజడి తగ్గలేదు। అధిక ధరలు తగ్గలెదు, ఆకలి తగ్గలేదు, పెరిగిన ధరల్లో పేదవాడు తిండిగింజలు కొనుక్కోలేక తిరగబడుతున్నాడు. ఉన్నవారి ధాన్యాగారాలమీద పడి దోచుకోవటం మొదలుపెట్టారు. ఎక్కడ చూసినా అశాంతి–అరాజకం–

సింహబల చక్రవర్తిగారికి చిర్రెత్తింది। వెంటనే మరలా చతురంగబలాన్ని దేశంమీదికి శాంతిభద్రతలు కాపాడేందుకు పంపాడు. వారు ఎదురుతిరిగిన పేదవారినీ, దోపిడీచేసిన ఆకలి ఆవేశంగాళ్ళనీ పశువుల్నిబాదినట్టు బాదటం మొదలేశారు.

ఇదిలా జరుగుతున్న సమయంలో–

కవిసామ్రాట్టు లోకనాథులవారికో విచిత్రానుభూతి కలిగింది।

'ఎందుకీజనానికిలా ఆకలవుతుంది? ఎందుకీజనం యిలా ప్రభువుమీద తిరగబడతారు?? ఏమిటీ అర్థంలేని ఆకలి ఆవేశం???' అనుకున్నాడు. వీటన్నిటికీ మూలం ఆయనకు తట్టింది.

355

వెంటనే సింహబల మహాచక్రవర్తిని కలుసుకొని 'మహారాజా!' అన్నాడు.

'ఏమిటి కవిసామ్రాట్టూ'? సింహబలుడు ప్రశ్నించేడు.

'ఒక వేయిన్నొక్కబండి తాళపత్రాలు కావాలి'

'అన్నెందుకు స్వామీ!'

'కావాలి! సనాతనాచారాలు అడుగంటి దేశం అరాజకం పాలవుతుంది. ప్రజలు మూర్ఖుల్లాగా తయారై ఎదురు తిరగటం జరుగుతుంది. తమ సింహాసనం భద్రంగా ఉండాలంటే మరోసారి మహాభారత రచన జరగాలి'

'మహాభారతాన్ని మరలా వ్రాస్తారా స్వామీ!'

'ఔను! మరలా వ్రాస్తాను. అదే ఈదేశానికీ ప్రభువులకీ శ్రీరామరక్ష. కల్ప వృక్షము!' గంభీరంగా అన్నాడు కవిసామ్రాట్టు లోకనాధుడు సామ్రాట్టు సింహబలునితో.

సింహబలునికి వెంటనే పరమానందం కలిగింది. ఎక్కడెక్కడ తాళపత్రాలన్నీ కొట్టుకురావలసిందిగా తన సైన్యానికి హుకుం జారీచేసేడు. వెంటనే సైన్యం దేశంమీద బడి తాళ్ళమీద ఆకులులేకుండా చేరవేసేరు!

ప్రజలు ఇవన్నీ ఎందుకని సైన్యాన్నడిగినపుడు—

'మీకోసమే! మీ క్షేమంకోసమే— మీ ఆకలితీరటం కోసమే— మీకు శుభాలు కలగటం కోసమే లోకనాధ కవి మరోసారి మహాభారత రచన సాగిస్తున్నారం'టూ చెప్పేరు.

కొందరు పేదలుప్పొంగి పోయేరు! ఆకులన్నీ సైన్యం కొట్టుకుపోయాక- తమ యిళ్ళమీద ఆకులు లేకపోయినా వారేమీ విచారపడలేదు. వర్షం ధారగాపడి తాము పూర్తిగా తడిసినా వారావేదన చెందలేదు. కారణం తమకు శుభాలు కలగటం కోసం మహాభారత రచన మరోసారి సాగుతోంది.

'ఆకు లింటిమీదుంటే ఏం ప్రయోజనం. ఆస్థానకవి ముందుంటేనే అన్నిటికీ శుభప్రదం' అనుకున్నారు.

ఒకానొక శుభముహూర్తాన కవిసామ్రాట్టు మహాభారత రచనకు శ్రీకారం చుట్టి మహావేగంగా రచన కొనసాగించేరు! తమ రచన సాగినంతకాలమూ దేశంలో శాంతి భద్రతలు కాపాడవలసిందిగా రాజుగారిని అభ్యర్థించాడు! రాజుగారు వెంటనే సైన్యాన్ని దేశం నలుమూలలకీ పంపేడు.

356

ఇంట్లో లోకనాధుడు మహాభారతాన్ని వ్రాస్తున్నాడు।

బయట ఆకలయిన ప్రజలు ఎదురు తిరిగినపుడు మహారచన కెక్కడ విఘాతం కలుగుతుందోనని సైన్యం ఎదురుతిరిగిన వారిని పిట్టల్లా కాల్చివేశారు।

ఇంట్లో మహారచన మహాజోరుగా సాగుతుంది।

బయట 'దారుణ మిది ఘోరం' అంటూ గట్టిగా అరిచేరు। అచారం। అడుగు దాటరాద'న్నారు సైనికులు!

ఇంట్లో మహారచన మరీజోరుగా సాగుతుంది।

బయట- 'భరించలేం దీన్ని మేం! మాబ్రతుక్కో భరోసా చూపండ'నన్నారు. అలా అన్నవారిని జైల్లోకుక్కారు।

ఇంట్లో మహారచన మహాజోరుగా సాగుతుంది॥

బయట- గత్యంతరం లేక- బ్రతుక్కీమీ పాలుపోక ఆకలిని భరించలేక- ఎదురు తిరిగితే ఎక్కడ కాల్చివేస్తారోనన్న భయంకొద్దీ- ఎదురు తిరగలేని పిరికివారి కుటుంబాలు మూకుమ్మడి ఆత్మహత్యలు చేసుకున్నాయి. తప్పదు మరి! ఎదురు తిరిగి అలజడిరేపితే- మహారచనకు విఘాతం జరుగుతుంది।

అందుకే—

ఇంట్లో మహారచన మహా మహాజోరుగా సాగుతుంది। అలజడితో పనిలేకుండానే- వీటన్నిటికీ అతీతుడై తన మహారచన్ని అవలీలగా పూర్తిచేసేడు లోకనాధ కవి సామ్రాట్టు.

మరలా అవన్నీ వేయిన్నొక్క ఒంటెద్దు బండ్లు నిండిపోయాయి।

సింహబల మహాచక్రవర్తి సంతోషంగా లోకనాధుడ్ని కౌగలించుకొని తమకు గొప్ప సన్మానం జరుగుతుందని తెలియజేసేడు. వేయిన్నొక్క ఒంటెద్దు బండ్ల నీదేశం నలుమూలలకీ త్రిప్పి- ప్రభువుకు విధేయంగా బ్రతకండని ప్రజలకు పదేపదే ఉపదేశించేరు। తాజా భారతామృతాన్ని సేవించండి। ఆకలి నశించిపోయి అమరత్వాన్ని చెందుతారని అదేపనిగా చేప్పేరు।

ప్రజల కమృతం పంచిపెట్టిన తాళపత్ర గ్రింధాలన్నీ రాజధానీనగరం చేరుకున్నాక—

ఆ దినం నిండు సభదీరింది। లోకనాధుని ముఖాన కుంకుమ బొట్టు కళకళలాడుతుంది. తానుచేసిన సేవకు ఈ ప్రజలంతా ఎంత ఋణపడిందీ ఆయనకు పూర్తిగా అర్థమయ్యింది! అందుచే ఆయన కొంకగర్వం। లోకకళ్యాణ నిమిత్తం మరోసారి మహాభారతరచన చేశానని గట్టిగా విశ్వసించేడు।

సింహబల మహాచక్రవర్తి లేచి యిట్లా ఉపన్యసించేడు।

'ప్రజలారా। ఈయన మన ఆస్థానకవి. మీ బాధలూ- కష్టాలు తొలిగేందుకు ఒకసారి వ్రాసిన భారతాన్నే మరలా వ్రాయాల్సి వచ్చింది। దీనితో ఈదేశంలోని అధిక ధరలు పడిపోతాయి। ఆకలి తీరిపోతుంది। సర్వశుభాలూ ప్రజల కొనగూడుతాయి'

ఈదేశంలోని సమస్యలు తీరేందుకు పరిపాలకులతో కష్టనష్టాలకు గురైన ప్రజల బాధలు తీరేందుకు ప్రభువులతో భాగస్వామ్యం తీసుకున్నందుకు కృతజ్ఞతగా ఈయనకు ఆస్థానకవి పదవి నొసంగటమే కాకుండా–

'చంద్రునికో నూలుపోగులా- ఈయన సేవలకు చిన్న బహుమతిని సమర్పిస్తున్నాం. ఎంతోలేదు. ఒకలక్ష వరహాలు।'

సింహబలుడు కూర్చున్నాడు।

సభ కరతాళ ధ్వనులతో మారుమ్రోగింది।

లోకనాధుని మోములో మరికాస్త గర్వం తొంగిచూసింది.

'ప్రజల కష్టసుఖాలెరిగిన మహానుభావుడు గనుక- ప్రభువుల ఆస్థానంలో కవి పదవి లభించింది' అక్కడి ప్రజలనుకున్నారు।

'నిజమైన ప్రజాకవి గనుక 'ప్రజల ప్రభువు' ఆస్థానంలో పదవి లభించింది' పండితు లనుకున్నారు।


## ప్రభంజనం

(రాజకీయ పక్ష పత్రిక)

పాఠకుల్లో అపూర్వ సంచలనం కలిగించి,
అనివార్యకారణాలవల్ల కొన్నాళ్ళు దూరమై-
తిరిగి కొత్త వూపిరితో మరింత బలంతో వెలువడుతుంది.

వివరాలకు:

ఎడిటర్
ప్రభంజనం
రాజకీయ పక్ష పత్రిక
ప్రొద్దుటూరు.